# 'నిరసన - నిరశన'

అలిగి పనులు సాధించుకోడం గురించి మనకు పురాణ కాలం నించీ వున్నదే... దానికి సత్యాగ్రహం అన్నపేరు పెట్టి గాంధిగారు కొత్తదారులు తొక్కించారు. ఆయన తద్వారా సాధించిన వాటి గురించి నేను ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. (ఉందేమో! ఇప్పటి కుర్రకారుకి మన స్వాతంత్ర్య పోరాట విషయాలు ఎంతవరకూ తెలుసో మనకు తెల్సిందే... వాళ్లకు అన్నింటికన్నా సినిమా పరిజ్ఞానం బహుమెండు) నిన్నటికి నిన్న జూడాలు గుడారాలేసుకుని మెళ్లో దండవేసుకుని ప్రభుత్వ విధానాలకు నిరసనగా నిరశన దీక్షలు చేసారు (ఓడారో గెలిచారో తెలియని స్థితిలో అన్నీ వదిలేసారు అది వేరే విషయం లెండి)

ఇంతకీ సత్యాగ్రహం అంటే అన్నం తింటం మానేయాలనే అర్థం వచ్చి కూచుండిపోయింది. అన్నం తింటూ కూడా (కావాలంటే ఇంకాస్త ఎక్కువగా తింటూనే) ఆగ్రహం వ్యక్తం చేయొచ్చుగదా... అది సత్యాగ్రహం ఎందుక్కాదో నా మందబుద్ధికి తెలిసిరాదు.

నిరశన అంటే భోజనరహితంగా (అశనం అంటే అన్నము, భోజనము అని నిఘంట్వర్థం) వుంటూ నాక్కావల్సింది ఇవ్వకపోతే చస్తానూ అని బెదిరించడం.. అవతలివ్యక్తో శక్తో మనకంటే బలమై ఉంటే మనం శారీరకంగానో మరోరకంగానో ఎదిరించలేక అన్నంమానేసి చస్తా చూస్కో అని బెదిరించడం...దీన్నే ఇంగ్లీషులో ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ అంటారు.

ఈ రోజుల్లో ఈ సత్యాగ్రహ నిరశన అన్నది ఓ పెద్ద ఫార్స్‌గా మారిపోయింది. ఒకప్పటి నిజాయితీ ఇప్పుడు కన్పించడంలేదు.

మన రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములుగారు ప్రాణాలే ఫణంగా పెట్టారు. ఆ రకపు నిజాయితీ ఈ రోజుల్లో నహి నహి...

ఈ మధ్య నిరశన దీక్ష కొత్త వేషం వేసుకుంది.

దాని పేరు రిలే నిరాహారదీక్ష... ఈ రిలే నిరాహారదీక్షలైతే ఏళ్ల తరబడి కొనసాగించొచ్చు.

పొద్దున దుబ్బపగలా బొక్కి వచ్చి మెళ్లో దండేసుకుని దిండుకానుకుని కునకడం. కడుపులోది అరిగి కరిగిం తర్వాత ద్యూటీ దిగినట్టు నెక్స్ట్ షిఫ్ట్ దీక్షగాడికి దండిచ్చేసి వేదిక దిగి ఇంటికెళ్లో లేదూ బార్‌కెళ్లో ఓ మూడు రౌండ్లు ఏసుకు మళ్లీ కడుపారా తినేసి రేపటికి రెడీ అయిపోవచ్చు.

అందుకే ఈ రిలేగాళ్లకు ఎవ్వరూ విలువివ్వరు.

నిరాహారదీక్ష గురించి ఆలోచించినప్పుడల్లా ఇద్దరు వ్యక్తులు నాకు వెంటనే స్ఫురణకొస్తారు. వాళ్లు రామిరెడ్డి, భాస్కరన్ పిళ్లైలు. ఇద్దరూ కమ్యూనిస్టు నాయకులు. కర్నూలునించీ శ్రీశైలం, వెళ్లేప్పుడు సున్నిపెంట చెక్‌పోస్టు పక్కన పదమూడు పదిహేనడగులెత్తున వాళ్ల స్మారక స్థూపాలు కనిపిస్తాయి.

శ్రీశైలం ప్రాజెక్టు కట్టడం సమయంలో కూలీలు బాగా దోపిడీకి గురయ్యేవారు

డెబ్బై దశకం పూర్వార్థంలో వాళ్ల రోజు వారీ కూలీ అయిదు రూపాయలుండేది. కాంట్రాక్టర్లు సిండికేటుగా మారి కూలీల శ్రమ దోచుకునేవారు. కూలీలు ఎంత మొర పెట్టుకున్నా నయాపైసా పెంచే వారు కాదు. కూలీలకు గత్యంతరం లేదు. పైగా అప్పుడు ఆ ప్రాంతంలో వాళ్లకు ఏ సౌకర్యాలూ వుండేవి కావు. వాళ్లకై వాళ్లు పోరాడేందుకు వాళ్లకు శక్తిలేదు. అప్పుడు ఈ రామిరెడ్డి భాస్కరన్ పిళ్లైలు కూలీల తరపున వకాల్తా పుచ్చుకుని కాంట్రాక్టర్లతో మంతనాలు చేశారు.

మాటలతో ఫలితాలు రాలేదు. ఒక సమ్మెకు దిగాల్సిన అగత్యం ఏర్పడ్డది.

కూలీల సమ్మెతోపాటు రామిరెడ్డి భాస్కరన్ ఫిళ్లైల నిరశన దీక్ష మొదలైంది. ముందు కాంట్రాక్టర్లు ఈ విషయాన్ని తీవ్రంగా పరగణించలేదు. కడుపు మాడితే వాళ్లే దిగివస్తారని ఉపేక్షించారు. వారం దాటింది కాంట్రాక్టర్లు కొద్దిగా ఆలోచించడం మొదలైంది. పదిహేను రోజులు దాటాయి. రామిరెడ్డి భాస్కరన్ల ఆరోగ్యస్థితి క్షీణించడం మొదలు కాసాగింది. కాంట్రాక్టర్లు చర్చల కొచ్చారు. కానీ కూలీలు పెంచేందుకు నిరాకరించారు వీళ్ల దీక్ష కొనసాగింది. ఇరవై రోజులు దాటాయి. కాంట్రాక్టర్ల గుండెల్లో ఫైరింజన్లు.

దిగి రావడానికి కొద్దిగా సుముఖంగా కనిపించారు. ఒక్క రూపాయి కూలీ పెంచడానికి ఒప్పుకున్నారు. కనీసం రెండున్నర రూపాయలు పెంచాలి అని రామిరెడ్డి, భాస్కరన్లు మొండికెత్తారు. కాంట్రాక్టర్లు వెనక్కెళ్లిపోయారు. సమ్మె... నిరాహారదీక్ష ఇరవై ఏడు రోజులకు వచ్చింది. ప్రాజెక్టు పనులు దిగ్బంధం అయివున్నాయి. కాంట్రాక్టర్లు తలవంచారు. కూలీ ఏడున్నర్రూపాయలు ఇచ్చేట్టు అగ్రిమెంటు జరిగింది. కార్మిక శక్తి విజయకేతనం ఎగరేసింది. ఆ ఆనందంతో రామిరెడ్డి భాస్కరన్ ఫిళ్లైలు అమాయకంగా వెళ్లి ఆ శుభావసరాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు బిర్యానీ తినేసారు. ఇరవైఏడు రోజులు నిరశనతో మాడి ఎండిపోయిన జీర్ణాశయాలు బిర్యానీని జీర్ణించుకోలేక రామిరెడ్డి భాస్కరన్ ఫిళ్లైలు నిజంగానే అమరులై అశువులు కోల్పోయారు. సమ్మె గెలిచినందుకు పండుగ చేయాలో తమని గెలిపించిన కామ్రేడ్ల మృతికి శోకించాలో తెలియని అయోమయ స్థితి.

* * *

*అన్నం ప్రాణం కూడా తీయగలదని ఆ రోజున చాలామందికి తెలిసొచ్చింది.* ●